క్లుప్తంగా

స్వామివారికి వెండి నాగపడగ సమర్పణ

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విజయవాడ వాస్తవ్యులు దివి జనార్ధనరావు కుటుంబ సభ్యులతో 453 గ్రాముల వెండ నాగపడగను సోమవారం సమర్పించారు. ఉదయం ఆలయంలో ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరావుకు సుమారు రూ. 44 వేల విలువైన నాగపడగను అందజేశారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



చిలకలపూడి(మచిలీపట్నం): పోలీస్ కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు కె.కృష్ణ కుటుంబ సభ్యులకు సోమవారం హోంగార్డ్స్ వన్ డే కంట్రిబ్యూషన్ చెక్కును అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గూడూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణ ఈ ఏడాది జూలై 29వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించారన్నారు. జిల్లాలో హోంగార్డులందరూ ఒక రోజు వేతనంగా ఇచ్చిన రూ.3,86,240 చెక్కును కృష్ణ భార్య రత్న కుమారికి ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ కె.రవికుమార్ పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులకు గొడుగులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుంగల చంద్రశేఖర్ సహకారంతో సోమవారం స్థానిక ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు గొడుగులు అందించారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంఈవో దుర్గాసాగర్, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు జి.శివరాం, కె.ప్రభాకర్, పాఠశాల హెచ్ఎం కె .కృష్ణకుమారి, సీఆర్పీ కె.బాలకృష్ణ, కోసూరు శివనాగమల్లేశ్వరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

నాగాయలంక: కృష్ణానది తీరంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న గ్రామస్తురాలు కడవకొల్లు లక్ష్మీకుమారి నుంచి ఎనిమిది క్వార్టర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్ సోమవారం చెప్పారు. ఆమె ఇంటి ముందు మద్యం సీసాలు అక్రమంగా ఉంచి అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి.. లైసెన్స్ లేకుండా మద్యం అమ్ముతున్నందున లక్ష్మీకుమారిని అరెస్ట్ చేశామని చెప్పారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణ చేశామని, ఆమె తన ఇంటి వద్ద చట్ట విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించగా కేసు నమోదు చేశామని తెలిపారు.

- పర్రచివర శివారు బిల్లీగ్రాహంనగర్‌కు చెందిన చిక్కాల వెంకటేశ్వరమ్మను మద్యం అక్రమంగా తరలిస్తున్న కారణంగా నాగాయలంక ఏటిమొగ బస్‌స్టాప్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం పట్టుకుని 10 క్వార్టర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కలిదిండి రాజేష్ చెప్పారు.

అడుగు తప్పితే అంతే

గొల్లమంద రహదారిపై స్థానికులు

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని గొల్లమంద-జింకపాలెం మధ్య ఉన్న ఈ రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వచ్చిన వరదకు ఈ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. మళ్లీ వచ్చిన వరదకు ఉన్న కొద్దిపాటి రహదారి కూడా నీటికి నానిపోయి పెచ్చులు పెచ్చులుగా నదిలో పడిపోతోంది. అడుగు తడబడితే అంతే నదిలోకే అన్నంత ప్రమాదకరంగా మారింది. కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఈ ప్రాంతంలో పర్యటించగా.. తమ గోడును వెళ్లబోసుకునేందుకు వచ్చిన ఈ రెండు గ్రామాల ప్రజలు రహదారిపై అడుగు వేస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడ్డారు. జింకపాలెం, గొల్లమంద గ్రామాలకు ఏకైక మార్గమైన ఈ రహదారికి రిటైనింగ్ వాల్ నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెక్కుల అందజేత



అవనిగడ్డ: వరద బాధిత పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ లక్ష రూపాయల చొప్పున వ్యక్తిగత సాయం చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. గాంధీక్షేత్రంలో సోమవారం ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవనిగడ్డ, చల్లపల్లి, పెదపారుపూడి, మొవ్వ మండలాలకు చెందిన పది గ్రామ పంచాయతీలకు లక్ష చొప్పున చెక్కులను కార్యదర్శులకు బుద్ధప్రసాద్ అందించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ముంపులో పొలాలు

- రైతులకు తప్పని పాట్లు
- పెడనలో స్వచ్ఛందంగా మురుగుబోదెల్లో తూడు తొలగించుకుంటున్న రైతులు
- కోడూరులో ఉప్పునీరు ఎగువకు రాకుండా పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు అడ్డుకట్ట
- ముంపు పోయినా ఇసుక మూటలు తొలగించని వైనం
- మూడు వేల ఎకరాల్లో మునకబారిన పొలాలు



దింటిమెరక సమీపంలో నీట మునిగిన పంట పొలాలు



పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్ల వెంట వేసిన ఇసుక బస్తాలు

పెడన: భారీ వర్షాలకు వరి చేలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వానలకు తోడు డ్రెయిన్లు, కాలువలు పొంగిపొర్లుతుండటంతో పొలాల్లో నీరు బయటకు పోని పరిస్థితి. అయితే బయటకు పోయే అవకాశమున్నా తూడు, గుర్రపు డెక్క అడ్డంకిగా మారాయి. వీటిని తీయడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో రైతులే స్వచ్ఛందంగా వీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల పెడన తోటమూల ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాలకు సంబంధించి నీరు పోవడానికి రైతులు తూడు తొలగించుకున్నారు. తామర చెరువు నుంచి లజ్జబండ ప్రధాన డ్రెయిన్ వరకు ఉన్న మురుగుబోదెలో తూడు తీశారు. తాజాగా నందిగామ, దావోజిపాలెం గ్రామాలకు చెందిన రైతులు బూదెకోడు మురుగుబోదెలోని గుర్రపు డెక్క, తూడు తొలగించే పనిలో పడ్డారు. అధికారులకు చెప్పినా స్పందన లేకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా అడుగులు వేశారు. సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉంటుందని, ముంపు బారి నుంచి రక్షించుకోవడానికి చర్యలు చేపట్టినట్లు నందిగామ రైతులు తెలిపారు.

కోడూరు: అధికారుల నిర్లక్ష్య వైఖరితో అన్నదాతలు నిండా మునిగారు. సముద్రం ఉప్పు నీరు ఎగువకు చొచ్చుకు రాకుండా పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద డ్రైనేజీ అధికారులు ఇసుక మూటలతో అడ్డుకట్ట వేశారు. దీని ద్వారా న్యూ ఇరాలి డ్రైనేజీ పరిధిలో ఉన్న పంట పొలాల్లోని మురుగు మొత్తం సముద్రంలోకి చేరుతుంది. ఉప్పునీరు రాకుండా ముందు జాగ్రత్తగా అధికారులు వేసిన అడ్డుకట్ట ప్రస్తుతం రైతుల పాలిట శాపంగా మారింది. వరదలు, వర్షాలు తగ్గి మూడు రోజులు గడుస్తున్నా కూడా స్లూయిజ్‌కు వేసిన అడ్డుకట్టలను అధికారులు తొలగించకపోవడంతో పంటలు పూర్తిగా ముంపుబారిన పడ్డాయి. స్లూయిజ్ గేట్లకు అడ్డుగా ఈ కట్టలు ఉండటంతో పొలాల్లో మురుగు దిగువకు వెళ్లక వర్షం నీరు పంట పొలాల్లోనే ఉండిపోయాయి. దీంతో రామకృష్ణాపురం, ఊటగుండం, హంసలదీవి, దింటిమెరక గ్రామాల పరిధిలోని మూడు వేల ఎకరాల్లో వరి మునకబారిన పడి పంట దెబ్బతింది. భారీ వర్షాలు ఆగిన వెంటనే అడ్డుకట్ట తొలగిస్తే పొలాల్లో నీరు దిగువకు వెళ్లి పంటకు నష్టం ఉండేది కాదని రైతులు అంటున్నారు. డ్రైనేజీ అధికారులకు అడ్డుకట్టలు తొలగించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో తామంతా తీవ్రంగా నష్టపోయామని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుతం పొలాలు మొత్తం చెరువులను తలపిస్తున్నాయని, వరినాట్లు వేసిన చోట దుబ్బులు కుళ్లిపోయి పంట పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నారుమళ్లు పోసుకొని వరినాట్లు వేయాల్సిన పరిస్థితి దాపురించిందని మనోవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించడంతో పాటు వెంటనే అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు అడ్డుకట్టను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



పెడన తోటమూలలో మురుగుబోదెలో తూడు తొలగించుకుంటున్న రైతులు

పది రోజులైనా..

బంటుమిల్లి: మండలంలో వాయుగుండ ప్రభావానికి జలమయమైన కాలనీలు, పంట పొలాలు దాదాపు పది రోజులైనా నీళ్లలోనే ఉన్నా పట్టించుకునే నాథుడు లేడంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. బంటుమిల్లి, నాగేశ్వరరావుపేట, పెందుర్రు మైనర్ డ్రెయిన్లలో అడ్డంకుల కారణంగా పలు కాలనీల్లోను, పంట పొలాల్లోను నిలిచిపోయి ఉంది. పెందుర్రు మీడియం డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, జమ్ము, కిక్కిస పొదల కారణంగా ఈ మైనర్ డ్రెయిన్లలో నీరు బయటకు పోవడం లేదు. దీని కారణంగా బీఎన్నార్ కాలనీ, బీసీ కాలనీలతోపాటు బంటుమిల్లి-మచిలీపట్నం 216 జాతీయ రహదారిపై దాదాపు 10 రోజులుగా నీరు పారుతోంది.

కొడాలి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

ఘంటసాల: సామాజిక భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుపడటంతో పాటు ఎస్సీ పిల్లలను హేళనగా మాట్లాడిన కొడాలి పంచాయతీ కార్యదర్శిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరి సర్పాలకు ఆవాసంగా మారిందని చెప్పారు. స్థానిక యువకులు విరాళాలు సేకరించి భవనానికి మరమ్మతులు చేయించి రంగులు వేయించి బాగుచేయించారని తెలిపారు. విద్యుత్ మీటర్ ఇప్పించాలని కార్యదర్శిని కోరగా సాకులు చెబుతున్నారని చెప్పారు. ఇక్కడ చాలా చీకటిగా ఉందని, కరెంట్ మీటర్ ఇప్పిస్తే చదువు కోవడానికి ఉపయోగపడుతుందని ఇటీవల కొంతమంది ఎస్సీ పిల్లలు కార్యదర్శిని కోర మీకు చదువు ఎందుకు, విద్య రాదని హేళనగా మాట్లాడారని చెప్పారు. ఎస్సీలను అవమానించిన కార్యదర్శిపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడ ముంపునకు ప్రభుత్వ వైఫల్యమే కారణం

- ముందస్తుగా ప్రాజెక్టులను ఖాళీ చేయలేదు
- బుడమేరు గేట్లు ఎత్తేటప్పుడు ముందస్తు హెచ్చరికలు లేవు
- ప్రచారమే తప్ప బాధితులకు న్యాయం జరగడం లేదు
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: విజయవాడ ముంపునకు ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎగువన ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేస్తున్నట్టు, అతి భారీ వర్షాలు ఉన్నట్టు ప్రభుత్వానికి ముందస్తు సమాచారం అందినా సరిగా స్పందించలేదని తెలిపారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీ నుంచి ముందస్తుగా కొంతనీటిని విడుదల చేసి కాస్త ఖాళీ చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని స్పష్టం చేశారు. బుడమేరు గేట్లు ఎత్తుతున్నట్టు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే అంతమంది ప్రాణాలు, ఇంత ఆస్తి నష్టం జరిగేది కాదని వివరించారు. వరదతో ఒక ప్రాంతంలో ఇంత మంది ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఎప్పుడూ జరగలేదని, గతంలో ప్రకాశం బ్యారేజీ నుంచి 11 లక్షల క్యూసెక్కులు వరద నీటిని ఒకేసారి కాకుండా తక్కువ తక్కువగా వదిలేవారని పేర్కొన్నారు. అది కూడా వారం, పదిరోజుల పాటు వదిలేవారని ఈ సారి ఒకేసారి 11.50 లక్షలు వదలడం, అదికూడా రెండు రోజుల్లోనే విడుదల చేయడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కూలిపోయాయని విద్యుత్, తాగునీరు సౌకర్యం దెబ్బతిందని, రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. సీఎం చంద్రబాబు బస్సులోనే ఉండి రాత్రిపగలు తేడా లేకుండా సేవలందిస్తున్నారని ఎల్లో మీడియా బాకా ఊదుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ దిగువ ముంపు ప్రాంతాల ప్రజలకు తాగునీరు, ఆహారం అందించకపోవడం కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే అని తెలిపారు. విపత్తుల సమయంలో ప్రచారానికి ఇస్తున్న ప్రాధాన్యం బాధితులకు సాయం చేయడంలో లేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం సక్రమంగా స్పందించి వరద ముంపు ప్రాంతాల బాధితులకు అన్ని విధాలా సాయపడాలని రమేష్‌బాబు చెప్పారు.

అందరి కృషితో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

మోపిదేవి: అందరి కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందని మోపిదేవి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన పాఠశాల హెచ్ఎం జయంతికి స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ బోధనతో పాటు మంచి ర్యాంకులు సాధించడంతో తాను అర్జీ దాఖలు చేయకపోయినా కలెక్టర్ డీకే బాలాజీ, డీఈవో తాహెరా సుల్తానా.. ప్రతిభను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు మాట్లాడుతూ జెడ్పీ పాఠశాలను ప్లస్ పాఠశాలగా అభివృద్ధి చేశారని అభినందించారు. అనంతరం హెచ్ఎం జయంతి, జోసఫ్ దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ నాంచారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి, సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ సీహెచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొద్దిగా తగ్గిన వరద

3.46 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల



అవనిగడ్డ: దివిసీమకు వరద ఉధృతి కొద్దిగా తగ్గింది. ఆదివారంతో పోలిస్తే సోమవారం లక్ష క్యూసెక్కుల వరద తగ్గింది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఆదివారం 4.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయగా, సోమవారం 3.46 లక్షల క్యూసెక్కులకు తగ్గించి విడుదల చేశారు. పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది. ఎడ్లంకకు రాకపోకలు తెగిపోగా పడవ ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు.

ప్రమాదపుటంచుల్లో బంటుమిల్లి ప్రధాన కాలువ



బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కాలువ ప్రమాదపు అంచుల్లో ప్రవహిస్తోంది. ఈ క్రమంలో సాతులూరు పంచాయతీ శివారు సాతులూరు రేవు వద్ద అంచులు దాటి నీరు గ్రామంలోకి వస్తుందని భావించిన అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి నీటి ప్రవాహం పెరగడంతో నాగేశ్వరరావుపేట గ్రామం వద్ద నీరు గ్రామంలోకి ప్రవేశించే పరిస్థితులు తలెత్తడంతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు, గ్రామస్తులు కలసి రాత్రి సమయంలో జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో కోతకు గురైన ప్రాంతంలో మట్టిపోసి తీసుకున్నారు. రెండు, మూడు రోజులు అధిక వర్షాలు పడతాయని చెబుతున్న క్రమంలో కాలువ పరీక ప్రాంత గ్రామాల్లో ఆందోళన నెలకొంది.

నాంచారమ్మదేవికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: స్థానిక మాచవరంలోని పాత పోస్టాఫీస్ వద్ద ఇటీవల ప్రతిష్ఠించిన శ్రీ నాగ నాంచారమ్మవారికి సోమవారం ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కొరపాటి శ్రీనివాస్, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో తొలి పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం యార్లగడ్డ కుటుంబీకులు పాల పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు.


పేద విద్యార్థికి సాయం

మచిలీపట్నంటౌన్: ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి శ్రీపతి సాయి శేషు వర మణికంఠకు ఆ సంఘ అధ్యక్షుడు పిల్లా రిశెట్టి శ్రీనివాసరావు చేతులమీదుగా సోమవారం ఆర్థిక సాయం ఇచ్చారు. స్థానిక బలరామునిపేటలోని రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావుతో పాటు సంఘ ప్రతినిధులు, ఇతర సభ్యులు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మణికంఠకు అందజేశారు.

అనుమతి లేని బుసక ట్రాక్టర్ నిలిపివేత

నాగాయలంక: స్థానికంగా ఎలాంటి అనుమతి లేకుండా బుసకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నిలిపేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ సోమవారం తెలిపారు. బుసక అక్రమంగా తరలిస్తున్నటు సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్ వద్ద ఎలాంటి అనుమతులు చూపకపోవడంతో స్టేషన్‌కు తీసుకువచ్చామని, తర్వాత చర్యలకు తహసీల్దార్ వద్దకు పంపామని ఎస్ఐ చెప్పారు.

అలరించిన శివలీలలు హరికథాగానం



నాగాయలంక: వినాయక నవ రాత్రి ఉత్సవ వేదికపై సోమవారం మధ్యాహ్నం జరిగిన శివలీలలు హరికథ గానం అలరించింది. బోడవరం సిద్ధాంతి ఏవీఆర్ మూర్తి ఆర్థిక సౌజన్యంతో తిరుపతికి చెందిన కుమారి దివ్యసాయి భాగవతారిణి గానం చేసిన శివలీలలు హరికథ భక్తులను ఆకట్టుకుంది. విద్వాన్ బ్రహ్మశ్రీ పాపర్తి ఆంజనేయులు(అవనిగడ్డ) వయోలిన్, విద్వాన్ ఎం.నగధరరావు(తెనాలి) మృదంగ సహకారం అందించారు. ఉదయం ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అంబా సాయికిరణ్‌శర్మ(కౌశిక్) బ్రహ్మత్వంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం జరిగింది.

మురుగు బయటకు పోవడానికి చర్యలు

బంటుమిల్లి: కాలనీల్లో మురుగునీరు బయటకు పంపడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భరత్‌రెడ్డి చెప్పారు. స్థానిక పంచాయతీ పరిధిలో పది రోజులుగా నీటిలో నానుతున్న కాలనీలను తహసీల్దార్ బి.భరత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. స్థానిక కాలనీలను సందర్శించిన ఆయన కాలనీల్లోకి వరద నీరు చేరడానికి కారణాలను వీఆర్వోల ద్వారా తెలుసుకున్నారు. ఈ రెండు కాలనీలకు ఆనుకుని పెందుర్రు, నాగేశ్వరరావుపేట మైనర్ డ్రెయిన్లు ఉన్న కాలనీల్లో నీరు ఎందుకు బయటకు పోవడం లేదో ఆయన అడిగారు. కార్యక్రమంలో డీటీ రామ్‌శివ, వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: ఆకులమన్నాడులో పలు లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన వరదనీరు పోవడానికి సర్పంచి ఎం.డి.రఫీ చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాల్లో జేసీబీ సహాయంతోయుద్ధ ప్రాతిపదికన కాల్వలు తీయిస్తున్నారు. దీంతో నీరు బయటకు పోతోంది. రోడ్డు వెంబడి ముళ్ల పొదలు తొలగిస్తున్నారు.

వరి పొలాల పరిశీలన



అడపావారిపాలెం(మోపిదేవి): కృష్ణా వరదల ముంపునకు గురైన వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. కేవీకే ఘంటసాల శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నాగేంద్రం, డాక్టర్ పి.శ్రీలత, డాక్టర్ లహరి ముంపు బారినపడిన పొలాలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. సాఫ్ కొట్టడంతో ఆకుమడుతగ్గి ఆకులు తిరగ మారుతాయని చెప్పారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ కడవకొల్లు సీతా రామాంజనేయులు, అరజా కాంత్, మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్ క్యాంప్‌నకు గూడూరు విద్యార్థిని

గూడూరు: ఆలిండియా ఎన్‌సీసీ గరల్స్ ట్రెక్కింగ్ క్యాంప్‌కు గూడూరు విద్యార్థిని లింగం రెజీనా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు వారం రోజుల పాటు కేరళలోని ట్రెక్కింగ్ క్యాంప్ జరగనుంది. గూడూరు హైస్కూల్ ప్లస్ తొమ్మిదో తరగతి చదువుతున్న రెజీనా ప్రతిష్ఠాత్మకమైన ట్రెక్కింగ్ క్యాంప్‌నకు ఎంపికవ్వడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మత్తి అరుణ, పీడీ రాజేష్ తదితరులు అభినందించారు.

నిమజ్జనంలో నలుగురికే అనుమతి

ఎస్ఐ రాజేష్

నాగాయలంక: నాగాయలంక కృష్ణానది శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ వద్ద వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున వినాయక నిమజ్జనానికి నలుగురికే అనుమతి ఉంటుందని స్థానిక ఎస్ఐ కె.రాజేష్ సోమవారం రాత్రి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని నది ఒడ్డున ఏర్పాటుచేశారు. నిమజ్జన సమయంలో మద్యం సేవించినవారికి, చిన్న పిల్లలకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం తర్వాత నదిలో స్నానాలకు అనుమతి లేకపోవడంతో తక్షణం ఘాట్ వదిలి వెళ్లిపోవాలని, పోలీసులకు సహకరించి ప్రమాదాలు నివారించాలని ఎస్ఐ సూచించారు.

మురుగునీటిలో బస్‌స్టేషన్!

నాగాయలంక: అధిక వర్షాలకు నాగాయలంక బస్‌స్టేషన్‌లో చుట్టు పక్కల నీరు లోపలకు చేరడం.. ఆ ప్రాంతం పల్లంగా ఉండటంతో తటాకంలో మారింది. బస్‌స్టాండ్ ప్రాంగణం పల్లమై గుంతలు కావడంతో గ్రామంలో ఒకవైపు మురుగు పారుదల మొత్తం ఆవరణలోకే చేరుతోంది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే పది రోజులు కావడంతో ఇప్పటికైనా బస్‌స్టేషన్‌లో ఇంజిన్‌తో నీళ్లుతోడించి బురద, మురుగును తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

భజే గణనాథం



బ్రహ్మపురంలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న యువత

పెడన: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో మూడో రోజుకు చేరాయి. చలువ పందిళ్లలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. భజన గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి పందిరి వద్ద బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను పూజారి గూడూరు జగన్మోహనరావు, కాత్యాయని దంపతులు అందజేశారు. మరికొన్ని చోట్ల అన్న సమారాధనలు చేశారు. బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు.


కోడూరు: కోడూరు మెరకగౌడపాలెంలోని వినాయకుడి ఆలయం వద్ద భజన జరిగింది. విశ్వనాథపల్లి, నరసింహపురం రామాయాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద శ్రీసిద్ధిబుద్ధి సమేత వినాయకస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. యర్రారెడ్డివారిపాలెం, ఉల్లిపాలెం, లింగారెడ్డిపాలెంలోని పందిళ్ల వద్ద నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

బంటుమిల్లి: స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో లక్ష్మీగణేష్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన చవితి పందిరి వద్ద నిర్వహించిన చిన్నారుల సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మల్లేశ్వరం గ్రామంలో, నాగేశ్వరరావుపేట గ్రామంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. స్థానిక గాంధీ మండపం వద్ద పూర కుటుంబ సభ్యులు వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న అన్నసమారాధన ఈ సంవత్సరంతో 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

మోపిదేవి: మోపిదేవి దేవస్థానంలోని గణేశుడి విగ్రహానికి ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం సాయంత్రం సమీపంలోని కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో వినాయక చవితి నవ రాత్రి మహోత్సవాలు మూడో రోజైనా సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 9వ డివిజన్ ఎన్జీవో కాలనీ నాలుగో లైన్‌లో జరిగిన పూజల్లో కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, చంటి దంపతులు పాల్గొన్నారు.



కోడూరులో ప్రత్యేక అలంకారంలో గణనాథుడు

యువత గుండెజబ్బు మరణాలపై అధ్యయనం చేయాలి



అవనిగడ్డ: ఇటీవల యువకులు గుండె జబ్బుతో మరణిస్తున్న నేపథ్యంలో వీటిపై అధ్యయనం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం గుండె జబ్బుతో మరణించిన యువ ఇంజినీర్ కొడాలి అఖిల్ మృతదేహాన్ని సోమవారం సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ 27 ఏళ్లకే అఖిల్ మరణించడం చాలా బాధాకరమన్నారు. గుండెజబ్బులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైతేపల్లి దాస్, గద్దం డానియేల్ అనిల్, కె నరసింహారాజు, కె మోహనరావు, గొరుముచ్చు కోటేశ్వరరావు మృతుని తల్లిదండ్రులను పరామర్శి సానుభూతిని తెలిపారు.